క్లుప్తంగా

15న ఉక్కునగరంలో పతంగుల పోటీ

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఉక్కునగరం యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న పతంగుల పోటీ నిర్వహిస్తున్నారు. ఉక్కునగరం త్రిష్నా మైదానంలో ఆ రోజు ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. పతంగులు, దానికి సంబంధించిన దారాలు మైదానంలో అందుబాటులో ఉంటాయని యూనిట్ చైర్మన్ సత్యానందం తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రోగ్రాం డైరెక్టర్ సిహెచ్. వేణును 98664 28664 నంబరు ద్వారా ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

చైతన్యనగర్‌లో ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

గాజువాక : జీవీఎంసీ 72వ వార్డు చైతన్యనగర్‌లో జీవీఎంసీ సిబ్బంది దోమల నివారణ చర్యలను చేపట్టారు. కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ శుక్రవారం ఫాగింగ్ చేయించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం ప్రతినిధులు శ్రీనివాస్, రెడ్డి విష్ణు, కాలనీ పెద్దలు వెంకటేశ్వరరావు, ఎస్‌వీ సుబ్బారావు, నాయకులు విష్ణుమూర్తి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న నర్సింగరావు

గాజువాక : బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. పాతకర్ణవానిపాలెంలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో ముగ్గురు విజేతలకు గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సిరసపల్లి నూకరాజు, సోంబాబు, గోలి శంకరరవు, డాక్టర్ శేషు ప్రసాద్, రోహిణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

4.3 కిలోల గంజాయి స్వాధీనం

పెదగంట్యాడ: మండలంలోని వెంకన్నపాలెం సమీపంలోని డాల్ఫిన్ లే–అవుట్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని న్యూపోర్టు పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగవరం ధారవీధికి చెందిన చేపల ఆనంద్, దయాల్‌నగర్‌కు చెందిన ఆసనాల శామ్యూల్ అలియాస్ పాము కళ్లు, ఆసనాల సురేష్ అలియాస్ సాహెబ్ పాడేరు నుంచి గుర్తు తెలియని వ్యక్తి ద్వారా గంజాయి తీసుకొచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లు కట్టి గంగవరం పోర్టుకు వచ్చే లారీ డ్రైవర్లు, కూలీలకు విక్రయిస్తుంటారు. ఇందులో భాగంగా శుక్రవారం కూడా వీరు వెంకన్నపాలెం సమీపంలోని డాల్ఫిన్ లే–అవుట్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో న్యూపోర్టు ఎస్‌ఐ మన్మథరావు సిబ్బందితో కలసి దాడులు చేశారు. వారి నుంచి 4.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

నృసింహ దీక్షల విరమణ

సింహాచలం: అడవివరానికి చెందిన సింహాద్రి మఠం ఆధ్వర్యంలో శ్రీనృసింహ దీక్షల విరమణ శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. మండల దీక్ష, 32రోజుల దీక్ష చేసిన 3860 మంది భక్తులు సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో దీక్షా విరమణ చేశారు. దీక్ష విరమించినవారిలో విశాఖ ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దీక్షాదారులంతా ఘాట్‌రోడ్డు, మెట్లమార్గంలో తిరుముడులతో సింహగిరికి చేరుకున్నారు. అనంతరం సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దీక్ష విరమణ చేశారు. దేవస్థానం తరఫున దీక్షాదారులందరికీ స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.


భోగి మంటల చుట్టూ నృత్యాలు చేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

అంతటా పండగ శోభ

తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి సంబరాలు నియోజకవర్గంలో అంబరాన్ని తాకుతున్నాయి. భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లికలు, చెరకు గడలు, గొబ్బెమ్మలు, కోలాటాలు, హరిదాసు సంకీర్తనలతో అంతటా పండగ వాతావరణం కనిపిస్తోంది. పరిశ్రమల్లో, విద్యా సంస్థల్లో ఉత్సాహంగా వేడుకలు నిర్వహిస్తున్నారు.

అగనంపూడి/పెదగంట్యాడ : వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్‌లో సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిపించారు. కంపెనీ డైరెక్టర్ బి.ఎస్.ఎన్.రాజు, ఫైనాన్స్ డైరెక్టర్ హేమచందర్, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పోటాపోటీగా ముగ్గుల పోటీలు : సంక్రాంతి అంటేనే ముంగిళ్లన్నీ రంగుల రంగవల్లికలతో కళకళలాడుతుంటాయి. అతివల అభిరుచిని గౌరవిస్తూ పలు చోట్ల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు. 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత సమీపంలోని ఏబీఎస్ పాఠశాలలో ముగ్గుల పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో వంద మంది విద్యార్థుల తల్లులు పాల్గొని, ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు. కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి విజేతలకు బహుమతులు అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో.. : 64వ వార్డు యారాడ, 75వ వార్డు పరిధిలోని రెడ్డి ముసలినాయుడుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులకు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ బుజ్జి, అంగన్‌వాడీ ఆయా, హెల్పర్ సులోచన తదితరులు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి


యారాడ అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు


రెడ్డి ముసలినాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకలు

దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు చేయూత


ఆశ్రమ అధినేతకు సరకులను అందిస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

కూర్మన్నపాలెం: దివ్యాంగులకు గాజువాక మరియు స్టీల్‌ప్లాంట్ పద్మశాలీ సంఘం చేయూతనిచ్చింది. అచ్యుతాపురంలోని దివ్యాంగుల ఆశ్రమం పాఠశాలలోని వంద మంది విద్యార్థులకు మూడు, నాలుగు నెలలకు సరిపడినట్లుగా సుమారు రూ.65వేల విలువైన నిత్యావసర సరకులను ఆశ్రమ అధినేత పి.ఎస్.టి.పట్నాయక్‌కు సంఘ సభ్యులు శుక్రవారం అందజేశారు. పద్మశాలి సంఘం ప్రతినిధి పప్పు రాజారావు మాట్లాడుతూ ఈ సంస్థకు మూడు, నాలుగు నెలలకు సరిపడా సరకులను 12 సంవత్సరాలుగా దాతల సహకారంతో అందిస్తున్నామన్నారు కొలిపాక అప్పారావు, టి.నారాయణరావు, తెడ్లపు సతీష్, పుట్టా శ్రీనివాసరావు, పోతురాజు, వెంకటరావు, గందోలి పైడికొండ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

'సర్వహిత' వితరణ


నిత్యావసర సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: ఆపదలో ఉన్న మూడు పేద కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిందించింది. నిర్వాసిత కాలనీ దానబోయినపాలేనికి చెందిన వృద్ధుని కుటుంబానికి, అలాగే కిడ్నీ వ్యాధితో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి కుటుంబానికి నిత్యావసర సరకులను అందజేసింది. ఒక్కో కుటుంబానికి 25 కిలోల వంతున బియ్యం, పప్పులు, నూనె డబ్బాలు, ఇతర వంట సామగ్రిని అందించింది. విందుల కనకరాజు, ట్రస్ట్ ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, పట్టా రామ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు సంక్రాంతి కళ


గాజువాక మెయిన్ రోడ్‌లో ఇసుకేస్తే రాలని జనం

గాజువాక : సంక్రాంతి షాపింగ్‌లతో గాజువాక మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. ఇసుకేస్తే రాలనంత జనంతో రద్దీగా మారాయి. ఒకపక్క ప్రధాన షాపింగ్‌మాల్స్, మరోపక్క రోడ్‌పక్క దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. ఇక్కడ స్థిరపడ్డ వలస కుటుంబాలు భోగిని ఇక్కడే జరుపుకొని సంక్రాంతికి తమ ఊళ్లకు పయనమవుతాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం తమ షాపింగ్‌లను పూర్తి చేసుకోవడం కోసం దుకాణాలకు జనం భారీగా వచ్చారు.

భోగి ఇక్కడ.. సంక్రాంతికి ఊళ్లో..

గాజువాక : గాజువాకలోని వివిధ ప్రాంతాల్లో 60 శాతం పైగా వలస కుటుంబాలు స్థిరపడ్డాయి. వారిలో కొండవాలు ప్రాంతాల్లోని కాలనీల్లో ఎక్కువ కుటుంబాలున్నాయి. సంక్రాంతికి ఆ కుటుంబాలు వివిధ జిల్లాల్లోగల తమ సొంత గ్రామాలకు పయనమవుతాయి. గాజువాకలోని ఖానోజీతోట, ఎల్‌బీఎస్ నగర్, దశమికొండ, శ్రీనగర్, సుందరయ్యకాలనీ, సింహగిరి కాలనీ, దయాళ్‌నగర్, పైడిమాంబ కాలనీ, పెంటయ్యనగర్, కృష్ణానగర్, గణేష్‌నగర్, బొజ్జన్నకొండతోపాటు అప్పన్న కాలనీల్లో సుమారు సుమారు 20వేల కుటుంబాలు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాయి. ఉపాధి కోసం ఇక్కడికి వలసొచ్చిన ఈ కుటుంబాల్లో దాదాపు 70 శాతం కుటుంబాలు మాత్రం పండక్కి వెళ్తాయి. ఇతర కాలనీల్లో నివాసముంటున్న వారిలోనూ అధిక సంఖ్యలో ఊరెళ్తారు. గాజువాకలోని పండగ షాపింగ్ పూర్తి చేసుకొని భోగిరోజు బయల్దేరతారు. వారం రోజులపాటు తమ సొంత గ్రామాల్లో గడిపి తిరిగి వస్తారు. లక్ష కుటుంబాలకు పైగా జనమున్న గాజువాకలో కొండవాలు ప్రాంత కుటుంబాలు ఊరెళ్లినా స్థానిక గ్రామాలు పెద్ద సంఖ్యలో ఉండటంతో ఇక్కడ జన సంచారంలో మాత్రం పెద్దగా తేడా కనిపించని పరిస్థితి ఉంటుంది.


జనంతో కిక్కిరిసిన మెయిన్ రోడ్

69వ వార్డులో రూ.1.92 కోట్లతో అభివృద్ధి పనులు


హరిజన జగ్గయ్యపాలెంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో కనివిని ఎరుగని రీతిలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 69వ వార్డు హరిజనజగ్గయ్యపాలెం, తుంగ్లాం గ్రామాల్లో రూ.1కోటి 92 లక్షల 44 వేలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా, హరిజనజగ్గయ్యపాలెం ముంపు సమస్యను తీర్చలేదని, తాను వచ్చిన వెంటనే రూ.1 కోటి వ్యయంతో ఆ సమస్యను తీర్చానని అన్నారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు కేవలం రాష్ట్రాన్ని దోచుకోవడానికి అధికారంలో రావటానికి ఉవ్విళ్లూరుతున్నాయని, కానీ జగన్‌మోహన్ రెడ్డి పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాల ద్వారా దోహదపడుతున్నారన్నారు. ఆయన చేస్తున్న మంచిని ప్రజలు హృదయాల్లో పెట్టుకుంటున్నారన్నారు. గ్రామ నాయకుడు ఉప్పాటి సుందరరావు శీలానగర్ ప్రధాన రహదారి పక్కన స్థలాలను ఆక్రమించి నిర్మించిన షాపుల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి మాట్లాడుతూ వార్డు సమస్యలపై ఎమ్మెల్యే నాగిరెడ్డి స్పందిస్తున్న తీరు అభినందనీయమన్నారు.

చేపట్టనున్న పనులు : హరిజన జగ్గయ్యపాలెం, తుంగ్లాంలలో రూ.49.95 లక్షల చొప్పున వ్యయంతో కల్యాణ మండపాలు, రూ.19.65 లక్షలతో కమ్యూనిటీ హాలు, కాపుతుంగ్లాంలో రూ.19.92 లక్షలతో కళావేదిక నిర్మాణం, రూ.17.67 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి, రూ.15.86 లక్షలతో సీసీ డ్రైన్లు, రూ.19.44 లక్షలతో శ్మశానవాటిక వద్ద సీసీ కాలువల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి భూమి పూజ చేశారు. జెడ్సీ పి.సింహాచలం, ఈఈ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, గ్రామ నాయకులు పెట్ల అప్పారావు, గుమ్మడి రామాంజనేయులు, కొత్తలంక సన్యాసిరావు, కమరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు


మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: అర్హతే ప్రాతిపదికగా ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పారదర్శకంగా ప్రతీ పేదవాడికి లబ్ధి చేకూర్చేందుకు ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి కాలనీ సచివాలయం–2లో దుగ్గపువానిపాలెం, ఉప్పరవానిపాలెం, కాశీపాలెం ప్రాంతాల్లో ఎమ్మెల్యే శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, మూడేళ్లలో ఒక్కొక్క కుటుంబానికి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. మీ సమస్యలను పరిష్కరించేందుకే మీ ఇంటి ముగింటకు వచ్చామని ప్రజలకు విన్నవించారు. ఈ సందర్భంగా స్థానికులు వీధి దీపాలు, డ్రైనేజీలు, కల్వర్టులు, సీసీ రోడ్ల సమస్యలను తెలియజేయగా, సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, కోమటి రమాదేవి, సీరం పాపారావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, వర్రె రాజు, శ్రీరాములు, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి గ్రూప్-2 కోచింగ్


కోచింగ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్టడీ సర్కిల్ ప్రతినిధులు

ఉక్కునగరం: అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి స్టడీ సర్కిల్ సారథ్యంలో జనవరి 20 నుంచి ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలకు కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు సమన్వయ కర్త కృష్ణారావు తెలిపారు. శుక్రవారం స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి గల అభ్యర్థులు shorturl.at/mvyF3 లింక్ ద్వారా వివరా లు నమోదు చేసుకోవాలన్నారు. 4 నెలల పాటు నిర్వహించే శిక్షణ తరగతులలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రూప్–2 ఆశావహులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80084 12798 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు యు.ఎస్.ఎన్. రాజు పాల్గొన్నారు.

గోదాదేవి పెళ్లి కూతురాయె..

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై శుక్రవారం ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున వెంకన్నకు, గోదాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా జరిపారు. తదపరి గోదాదేవిని పెళ్లికూతురుగా ముస్తాబు చేసి స్వామి సన్నిధిలో వేంచేయజేశారు. మహిళలు సామూహికంగా కుంకుమపూజ చేశారు. అలాగే అమ్మవారికి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని,స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు విశేషంగా జరిగాయి.


గోదాదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

ఈ నిర్ణయం పాలకుల అవగాహనా రాహిత్యమే..!

- ఉత్తరాంధ్రకు ఉక్కు పరిశ్రమ ఎంత ముఖ్యమో తెలియకపోవడం దురదృష్టకరం
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 701వ రోజుకు రిలే దీక్షలు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: ఉత్తరాంధ్ర వెనుకబాటుపై మాట్లాడే నేతలకు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రధాన భూమిక పోషించిన విశాఖ ఉక్కు ప్రాధాన్యం తెలియకపోవడం దురదృష్టకరమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశం నేటి పాలకుల అవగాహన రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 701వ రోజు శుక్రవారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్ విభాగ కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు తోడ్పడకుండా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్రప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. రానున్న కాలంలో లక్షలాది మంది కార్మికులు కర్షకులు, నగర పౌరులతో సమావేశం నిర్వహించి, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనను కార్మికులు, వారి కుటుంబసభ్యులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవీ రమణమూర్తి, జగదీష్, రంజిత్, సంజీవ్, రామరాజు, గిరిబాలయోగి, రాజేంద్ర, వరప్రసాద్, సాయి, శివ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా గర్జన జయప్రదం చేయండి


ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరుమల యాత్ర చేసిన కార్మికులను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. స్టోర్స్ కూడలి వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర నిర్ణయాన్ని రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు విడివిడిగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. వారందరినీ ఒక వేదికపైకి తీసుకు రావాలన్న ప్రధాన ఆశయంతో ప్రజా గర్జన బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చడం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తిరుమల పాదయాత్ర చేసిన ట్రాఫిక్ విభాగం కార్మికుడు రామారావు, బీఎఫ్ విభాగం కార్మికుడు సైనిబాబులను ఈ సందర్భంగా సత్కరించారు. యూనియన్ నాయకులు జె. అయోధ్యరామ్, యు.రామస్వామి, పి. శ్రీనివాసరాజు, పుల్లారావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.